సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025



చీనీ టన్ను రూ.19,510

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీ గరిష్టంగా రూ.19,510, కనిష్టంగా రూ.2,560 ప్రకారం ధర పలికాయి.



ఈయన సక్సెస్ నెవర్ ఎండ్

కనుమరుగవుతున్న గోలీసోడాలో ఆయన సక్సెస్ అయ్యారు. అనంత నుంచి ప్రస్థానం ప్రారంభించి అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు.

8లో



జిల్లా వ్యాప్తంగా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవి తాపం కొనసాగుతోంది. గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

ఫ్చ్.. ఫలితం మారలేదు!

- ఇంటర్ ఫలితాల్లో మెరుగుపడని ఉత్తీర్ణత
- ఫస్ట్ ఇయర్‌లో రాష్ట్రంలో 22వ స్థానంలో నిలిచిన జిల్లా
- సీనియర్ ఇంటర్‌లో 18వ స్థానంతో సరిపెట్టుకున్న వైనం

ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఫలితాలు ఇలా...

పరీక్ష రాసిన విద్యార్థులు	ఉత్తీర్ణులైన వారు	బాలురు	బాలికలు	ఉత్తీర్ణత శాతం
11,173	6,368	2,634	3,734	57

సీనియర్ ఇంటర్ ఫలితాలు ఇలా...

పరీక్ష రాసిన విద్యార్థులు	ఉత్తీర్ణులైన వారు	బాలురు	బాలికలు	ఉత్తీర్ణత శాతం
8,952	6,986	3,030	3,956	78





దివాకర్ (ఎంపీసీ) 984



ప్రకాశ్ 961



క్షితిరెడ్డి, 450

పుట్టపర్తి: ఇంటర్ ఫలితాల్లో జిల్లా ర్యాంకులు మారలేదు. గతంతో పోలిస్తే ఉత్తీర్ణత శాతంతో పాటు రాష్ట్ర ర్యాంకు కూడా తగ్గాయి. శనివారం ఉదయం ఫలితాలు విడుదల కాగా, ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఈసారి 57 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితంగా ప్రథమ సంవత్సరం ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో 22వ స్థానంలో నిలిచింది. జిల్లాలో మొత్తం 11,173 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయగా 6,368 మంది ఉత్తీర్ణత సాధించారు. గత సంవత్సరం 58 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అయితే వివిధ గ్రూపుల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు కార్పొరేట్, ప్రైవేట్‌కు పోటీ పడుతూ మార్కులు సాధించారు.

సీనియర్ ఇంటర్‌లోనూ అంతే...

ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో గతేడాది 76 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ సారి రెండు శాతం పెరిగి 78కి చేరింది. దీంతో రాష్ట్రంలోనే జిల్లా 18వ స్థానంలో నిలిచింది. మొత్తం 8,952 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 6,986 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ కోర్సుల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు కలిపి 2,457 మందికి గానూ 1,536 మంది పాసయ్యారు.

మెరిసిన గ్రామీణ విద్యార్థులు..

- కదిరి బాలుర ఉన్నత పాఠశాలలోని జూనియర్ కళాశాలలో చదువుతున్న ప్రకాశ్ ఎంపీసీ గ్రూపులో 961 మార్కులు సాధించాడు.
- కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో గారికోట క్షితిరెడ్డి 470 మార్కులకు గాను 450 మార్కులు సాధించి సత్తా చాటింది.
- లేపాక్షిలోని మహాత్మాజ్యోతిరావు పూలే ఏపీ గురుకుల పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 130 మంది పరీక్ష రాయగా, 109 (84 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 125 మంది పరీక్షలు రాయగా, 124 మంది (99.2 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్ విద్యార్థి దివాకర్ (ఎంపీసీ) 984 మార్కులు, జి.శ్రీకాంత్ (బైపీసీ) 959 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ సుందరరాజు తెలిపారు.

‘టాప్’ లేపిన ఆటో డ్రైవర్ కుమార్తె

- ఫస్ట్ ఇయర్ టాపర్‌గా టేకులోడు విద్యార్థిని మేఘన
- 440 మార్కులకు గాను 435 మార్కులు సాధించిన విద్యార్థిని
- సీనియర్ ఇంటర్‌లో బిందుకు 980 మార్కులు



బిందుకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు



మేఘన 435 బైపీసీ



కె. భవాని 462 ఎంపీసీ



బి. హర్షిత 961 ఎంపీసీ

చిలమత్తూరు: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో మండల పరిధిలోని టేకులోడు మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని మేఘన సత్తా చాటింది. గురుకుల కళాశాల విభాగంలో టాపర్‌గా నిలిచింది. రొద్దం మండలం కలిపి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వేణుగోపాల్ కుమార్తె జి. మేఘన ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో 440 (బైపీసీ) మార్కులకు గాను 435 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శోభారాణి, అధ్యాపకులు మేఘనను అభినందించారు. ఇక అదే కళాశాలలో జూనియర్ ఇంటర్‌కు చెందిన కె.భవాని (ఎంపీసీ) 470 మార్కులకు 462, దీప్తి 500 (ఎంఈసీ) మార్కులకు 484 మార్కులు సాధించారన్నారు. కాగా జూనియర్ ఇంటర్‌లో మొత్తం 162 మంది పరీక్షలకు హాజరు కాగా 132 మంది ఉత్తీర్ణత (81.48) సాధించారు. సీనియర్ ఇంటర్‌లోనూ 152 మంది (96 శాతం) ఉత్తీర్ణులయ్యారు బి. హర్షిత (ఎంపీసీ) 961, పి. హర్షిత (బైపీసీ) 957, భవ్యశ్రీ (సీఈసీ) 950, అక్షయ (ఎంఈసీ) 927 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

సీనియర్ ఇంటర్‌లో టాపర్‌గా బిందు..

సీనియర్ ఇంటర్మీడియట్ ఫలితాల్లో చిలమత్తూరు జూనియర్ కళాశాల విద్యార్థిని బిందు సత్తా చాటింది. చిలమత్తూరు మండల పరిధిలోని తుమ్మలకుంటకు చెందిన రైతు భాస్కర్‌రెడ్డి, సరితల కుమార్తె పూలకుంట బిందు ఎంపీసీలో 980 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. సామాన్య రైతు కుటుంబానికి చెందిన బిందు అసాధారణ ప్రతిభ కనబరిచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతూ అత్యధిక మార్కులు సాధించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భీముడు నాయక్‌తో పాటు అధ్యాపకులు విద్యార్థిని బిందును అభినందించారు. ఇక ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎం. శ్వేత (బైపీసీ) 422, శృతి (బైపీసీ) 405, పల్లవి (ఎంపీసీ) 416, సౌజన్య (హెచ్‌ఈసీ) 427 మార్కులు సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో శ్రావణి (బైపీసీ) 957, అక్షయ (బైపీసీ) 920 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఇంజినీర్ అవుతా



ఇంటర్ ఫలితాల్లో మంచి మార్కులు వచ్చి టాపర్‌గా నిలవడం చాలా సంతోషంగా ఉంది. మా నాన్న భాస్కర్‌రెడ్డి, అమ్మ సరితల ప్రోత్సాహంతో బాగా చదువుకున్నా. రానున్న రోజుల్లో బీటెక్ పూర్తి చేసి ఇంజినీర్ కావాలన్నది నా లక్ష్యం. మా అధ్యాపకులు బాగా ప్రోత్సహించారు. వారందరికీ నా కృతజ్ఞతలు.

– పూలకుంట బిందు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని

ప్రభుత్వ కళాశాలల సత్తా

- ఫస్ట్ ఇయర్‌లో అమరాపురం కళాశాలకు తొలిస్థానం
- సెకండ్ ఇయర్ ఫలితాల్లో ‘టాప్’ లేపిన అమడగూరు కళాశాల
- చివరి స్థానంలో ధర్మవరం బాలుర జూనియర్ కళాశాల

ధర్మవరం అర్బన్: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు సత్తా చాటాయి. ప్రథమ సంవత్సరం జనరల్ కోర్సుల్లో అమరాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల 78 శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో మొదటిస్థానంలో నిలిచిందని ఇంటర్ విద్య జిల్లా అధికారి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. అలాగే ధర్మవరం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల 17 శాతం ఉత్తీర్ణతతో చివరి స్థానంలో నిలిచిందన్నారు. ఇక ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అమడగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల 100 శాతం ఫలితాలతో జిల్లాలో మొదటిస్థానం దక్కించుకోగా, 44 శాతం ఉత్తీర్ణతతో ధర్మవరం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల చివరి స్థానంలో నిలిచిందన్నారు. ఇక ఒకేషనల్ కోర్సుల్లో ప్రథమ సంవత్సరం ఫలితాల్లో కదిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల 81 శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవగా, 24 శాతం ఉత్తీర్ణతతో ధర్మవరం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల చివరిస్థానంలో నిలిచిందన్నారు. ఒకేషనల్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కదిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల 96 శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో నిలవగా, 52 శాతం ఉత్తీర్ణతతో కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాల చివరి స్థానంలో నిలిచిందని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి రఘునాథ్‌రెడ్డి వెల్లడించారు.

15 నుంచి పరీక్ష ఫీజు చెల్లించొచ్చు

- మే 12 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

ధర్మవరం అర్బన్: ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు, ఇంప్రూవ్‌మెంట్ రాయాలనుకున్న విద్యార్థులు ఈనెల 15వ తేదీ పరీక్ష ఫీజు చెల్లించవచ్చని ఇంటర్ విద్య జిల్లా అధికారి రఘునాథ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ వరకూ ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉంటుందని, విద్యార్థులు తాము చదివే కళాశాలల్లోనే ఫీజు చెల్లించాలని సూచించారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 12 నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయన్నారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ చేయించాలనుకునే వారు ఈనెల 13వ తేదీ నుంచి www.bie.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రీకౌంటింగ్ ఫీజు ఒక పేపర్‌కు రూ.260, రీవెరిఫికేషన్ కోసం రూ.1,300 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీలో చోటు



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీలో ఉమ్మడి జిల్లా నుంచి ఐదుగురు నేతలకు చోటు దక్కింది. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కమిటీని పూర్తి స్థాయిలో పునర్వ్యవస్థీకరించారు. నూతనంగా నియమితులైన పీఏసీ సభ్యులను ప్రకటించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఉమ్మడి జిల్లా నుంచి మాజీ మంత్రులు డాక్టర్ సాకే శైలజానాథ్, మాలగుండ్ల శంకర్ నారాయణ, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య, ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వర రెడ్డి, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ కమిటీలో ఉన్నారు.

క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా ప్రకాష్ రెడ్డి

రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వైఎస్సార్ సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. జిల్లా నుంచి గతంలో ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వర రెడ్డి ఈ స్థానంలో ఉండేవారు. తాజాగా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి అవకాశం కల్పించారు.

వైభవం.. శ్రీగిరి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

పుట్టపర్తి టౌన్: పౌర్ణమిని పురస్కరించుకుని ఆనవాయితీ ప్రకారం శనివారం సాయంత్రం పట్టణంలో సత్యసాయి శ్రీగిరి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా అందంగా అలంకరించిన రథంలో సత్యసాయి చిత్రపటాన్ని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రశాంతి నిలయం ముఖద్వారం నుంచి రథాన్ని లాగుతూ ఊరేగింపుగా ప్రశాంతి నిలయం, విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి ,గణేష్ కూడలి, పెట్రోల్‌బంక్, చింతతోపు, గోవిందయ్యపేట, పెద్దబజార్ మీదుగా తిరిగి ప్రశాంతి నిలయానికి చేర్చారు. ఉత్సవంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వారితో పాటు విదేశీ భక్తులు కూడా భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు పీజీఆర్ఎస్ రద్దు

పుట్టపర్తి టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’ కార్యక్రమాన్ని ఈ నెల 14వ తేదీ (సోమవారం) రద్దు చేశారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించిన నేపథ్యంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

తల్లిని తిట్టి.. కొడుకును కొట్టి..

- రేషన్ డీలర్ నిర్వాకం

ధర్మవరం రూరల్: రావులచెరువు గ్రామంలో నాగేంద్రమ్మ తన కుమారుడు కార్తీక్‌తో కలిసి శనివారం రేషన్ కోసం స్టోర్‌కు వెళ్లారు. బియ్యం అందరికీ వేసేశామని, ఇప్పుడు వస్తే ఎలా అంటూ డీలర్ చెన్నారెడ్డి తన తల్లి నాగేంద్రమ్మను బూతులు తిడుతూ... తన చెంప చెల్లుమనిపించాడని కార్తీక్ తెలిపాడు. రేషన్ సక్రమంగా వేసేదిపోయి.. కార్డుదారులపై దురుసుగా ప్రవర్తించడమేంటని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

రమణీయం.. రథోత్సవం





ప్రత్యేక పూజలు అందుకుంటున్న లక్ష్మీ చెన్నకేశవస్వామి, తాడిమర్రిలో రథోత్సవంలో పాల్గొన్న అశేష జనవాహిని

- అంగరంగ వైభవంగా లక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవాలు


తాడిమర్రి: చెన్నకేశవ స్వామి నామస్మరణతో తాడిమర్రి మార్మోగింది. లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి రథోత్సవం రమణీయంగా సాగింది. మరగాళ్ల విన్యాసాలు, కీలు గుర్రాల నృత్యాలు, చక్క భజన, కోలాటం ప్రదర్శిస్తూ భక్తులు రథం ముందు సాగుతుండగా...దేవేరులతో కలిసి రథంపై కొలువైన లక్ష్మీచెన్నకేశవుడు భక్తులకు దర్శనమిచ్చారు.

యాగంతో ప్రారంభం..

ఆలయ అర్చకులు మామిళ్లపల్లి జయరామయ్యశర్మ, సంతోష శర్మ శనివారం ఉదయం బ్రహ్మ ముహూర్తంలో యాగం నిర్వహించి శ్రీవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించిన రథంలో ఉంచారు. ఉదయం 9.30 గంటలకు రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తుల గోవింద నామస్మరణ మధ్య కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు మడుగు తేరును లాగారు. అనంతరం సాయంత్రం 3.30 నుంచి భక్తాదులు గోవిందా... చెన్నకేశవస్వామి, వెంకటేశ్వర నామస్మరణ చేస్తూ తాడిమర్రి ప్రధాన వీధులలో రథాన్ని లాగారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి, గ్రామపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన రథోత్సవంలో మోదుగులకుంట, శివంపల్లి, మద్దుల చెరువు. నిడిగల్లు, పిన్నదరి, ఆత్మకూరు, పుల్లా నారాయణపల్లి, పెద్దకోట్ల, తదితర గ్రామాలతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు.

అట్టహాసం..చౌడేశ్వరీ ఉత్సవం





చీకిరేవులపల్లిలో దివ్యజ్యోతుల ఊరేగింపు, అమ్మవారి ఎదుట రాశిగా పోసిన జొన్నకూడు

- తొలిరోజు కుంభకూడుకు కిక్కిరిసిన భక్తజనం

అమడగూరు: చౌడేశ్వరీ దేవి ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు శనివారం కుంభకూడు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఏడాది కూడా చీకిరేవులపల్లికి చెందిన పశ్లెం నరసింహప్ప, చంద్రకళ, అలాగే దాసరి శివప్ప, రాధమ్మ దంపతులతో పాటుగా తొగటవీర సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎప్పటిలాగే రాత్రి ముత్యాల జొన్నలతో వండిన కూడును ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి ఎదురుగా పెద్ద ఎత్తున కుంభం వలె రాశిగా పోసి పూల కుచ్చును ఏర్పాటు చేశారు. అనంతరం ఆనవాయితీ ప్రకారం జంతువులను బలిగా ఇచ్చారు. పూజలన్నీ ముగిసిన తర్వాత రుధిరంతో తడిసిన జొన్నల కూడును, పూలకుచ్చును తీసుకెళ్లడానికి భక్తులు పోటీపడ్డారు. ఈ కుంభకూడును తీసుకెళ్లి నివాస గృహాలపైన, పంటపొలాల్లో, పశువులపై చల్లితే ఎటువంటి కీడు జరగదని భక్తుల నమ్మకం. కుంభకూడు కార్యక్రమానికి వివిధ ప్రాంతాల భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు.

ఆకట్టుకున్న జ్యోతుల ఊరేగింపు..

కుంభకూడును పురస్కరించుకుని చీకిరేవులపల్లి తొగటవీర క్షత్రియ సంఘం సభ్యులతో కలసి ధర్మవరానికి చెందిన 20 మంది అమ్మవారికి జ్యోతులు సమర్పించారు. తొలుత ప్రత్యేకంగా తయారుచేసిన జ్యోతులతో బోనాలు తయారు చేసుకుని చీకిరేవులపల్లి వీధుల గుండా ఊరేగారు. అనంతరం జ్యోతులను తలమీద పెట్టుకుని అమ్మవారి ఖడ్గ పద్యాలు చదువుతూ, పాటలు పాడుకుంటూ అమడగూరుకు వెళ్లి సమర్పించారు. సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, ఏఎస్ఐ వెంకటరాముడు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పురుషోత్తమరెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉట్టిపడిన తమిళ సాంస్కృతిక శోభ



కచేరీ నిర్వహిస్తున్న తమిళనాడు భక్తులు





నందనార్ నృత్యరూపకంలోని ఘట్టాలు

ప్రశాంతి నిలయం: సత్యసాయి సన్నిధిలో తమిళ సత్యసాయి భక్తులు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తకోటిని మైమరపించారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన తమిళనాడు సత్యసాయి యూత్ సభ్యులు శనివారం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం తమిళనాడు సత్యసాయి యూత్ బృందం సంగీత కచేరీ నిర్వహించింది. సత్యసాయిని కీర్తిస్తూ నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను ఆలరించింది. సాయంత్రం శివభక్తుడైన నందనార్ ఆధ్యాత్మిక చింతన, శివుడిపై అపారమైన భక్తిని వివరిస్తూ బాలవికాస్ చిన్నారులు ‘నందనార్’ పేరుతో నృత్య రూపకం ప్రదర్శించారు. శివుడి దర్శన భాగ్యం కోసం నందనార్ పరితపించిన తీరును చక్కగా వివరించారు. చివరకు నందనార్ భక్తికి మెచ్చిన శివుడు దర్శన భాగ్యం కల్పించిన తీరును కళ్లకు కట్టారు. అనంతరం తమిళ భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

మేమున్నామని.. మీకేం కాదని

- లింగమయ్య కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండ
- రూ. 5 లక్షల ఆర్థిక సాయం



చెక్కును అందజేస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్, తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి

రాప్తాడురూరల్: టీడీపీ నాయకుల చేతిలో హత్యకు గురైన రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కురుబ లింగమయ్య కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచింది. ఈ నెల 8న వారి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన ఆదేశాలతో బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు శనివారం అనంతపురంలోని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నివాసంలో లింగమయ్య భార్య రామాంజనమ్మ, కుమారులు హరి, శ్రీనివాసులుకు చెక్కును అందజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి చేతుల మీదుగా చెక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామగిరి ఆదిరెడ్డి, కాటిగాని కాలువ జనార్దన్‌రెడ్డి, బిల్లే మంజునాథ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువతి అదృశ్యం

గాండ్లపెంట : మండల పరిధిలోని ఓ తండాలో యువతి అదృశ్యమైంది. ఇటీవల యువతికి పెళ్లి సంబంధం చూసేందుకు తలుపుల మండలంలోని ఒక తండా నుంచి ఒక యువకుడు వచ్చాడు. అయితే ఈ సంబంధం అమ్మాయి కుటుంబ సభ్యులకు నచ్చలేదు. ఈ క్రమంలో శుక్రవారం నుంచి యువతి కనిపించలేదు. ఎన్నిచోట్ల వెదికినా జాడ కానరాకపోవడంతో యువతి తండ్రి శనివారం గాండ్లపెంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఇంటర్ విద్యార్థిని ..

పరిగి: ఇంటర్ పరీక్ష ఫలితాల విడుదల తర్వాత ఓ విద్యార్థి అదృశ్యమైంది. ఎస్ఐ రంగడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లేపాక్షి మండలం బయనపల్లికి చెందిన కీర్తన పరిగిలోని కేజీబీవీలో ఇంటర్ సీఈసీ ఫస్టియర్ చదువుతోంది. శనివారం ఇంటర్ పరీక్ష ఫలితాలు వెలువడ్డాయి. ఒక సబ్జెక్టు ఫెయిలవడంతో మనస్తాపం చెందిన కీర్తన కళాశాల నుంచి వెళ్లిపోయింది. ఈ మేరకు కళాశాల ఉన్నతాధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు

కదిరి అర్బన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబం గురించి అసభ్యకర కామెంట్లతో సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్న వ్యక్తులపై వెంకటరామిరెడ్డి అనే వ్యక్తి కదిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. పోస్టులు పెడుతున్న వారు ఎవరో గుర్తించి, చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆటో బాడుగ విషయంలో ఘర్షణ

గోరంట్ల: ఆటో బాడుగ విషయంలో డ్రైవర్‌తో ప్రయాణికులు ఘర్షణపడ్డారు. బూడిదగడ్డపల్లికి చెందిన జయప్ప ఆటోను అదే గ్రామానికి చెందిన ప్రతాప్, అతని తండ్రి నరసింహప్ప బాడుగకు మాట్లాడుకుని వెళ్లారు. అనంతరం బాడుగ ఇచ్చే విషయంలో డ్రైవర్‌తో వాగ్వాదం జరిగింది. సహనం కోల్పోయిన ప్రతాప్, నరసింహప్పలు కొడవలితో డ్రైవర్‌పై దాడిచేసి గాయపరిచారు. బాధితుడు జయప్ప ఫిర్యాదు మేరకు ప్రతాప్, నరసింహప్పపై కేసు నమోదు చేసినట్లు సీఐ బోయ శేఖర్ తెలిపారు.

ఈయన సక్సెస్ నెవర్ ఎండ్

- గోలీసోడాకు పునరుజ్జీవం తీసుకొచ్చిన యువ పారిశ్రామికవేత్త ఉదయ్‌కిరణ్‌రెడ్డి
- 'అనంత' నుంచి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన వైనం





తమ ఫ్యాక్టరీలో తయారైన గోలీసోడాలను చూపుతున్న ఉదయ్‌కిరణ్‌రెడ్డి, జయదీప్‌రెడ్డి, ఫ్యాక్టరీలో గోలీసోడాలు తయారుచేస్తున్న మహిళా కార్మికులు

అనంతపురం కల్చరల్: భారతదేశ సంప్రదాయ పానీయం గోలీసోడా. సుయ్‌మంటూ శబ్దం చేస్తూ గోలీని కిందికి దించి సోడా తాగుతుంటే దాని రుచి అద్భుతం. ఆ అనుభూతిని మాటల్లో చెప్పలేం. కొన్ని దశాబ్దాల క్రితం వరకూ ఓ వెలుగు వెలిగిన సోడా దాహార్తి తీర్చే పానీయంగానే కాదు.. భోజనం అరగకపోయినా గోలీసోడా తాగి ఉపశమనం పొందేవారు. అయితే మారిన కాలానికి అనుగుణంగా పలు రకాల కూల్‌డ్రింక్స్ మార్కెట్లోకి రావడంతో 140 ఏళ్ల చరిత్ర కల్గిన గోలీసోడా ప్రాభవం తగ్గింది. అలాంటి గోలీసోడాకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన యువ పారిశ్రామికవేత్త ఉదయ్‌కిరణ్‌రెడ్డి పూర్వవైభవం తీసుకొచ్చారు. 'నెవర్ ఎండ్' పేరుతో స్టార్టప్ కంపెనీగా మొదలై 'గోలీసోడా'ను కొత్త పుంతలు తొక్కించారు. వివిధ రకాల ఫ్లేవర్లు, అద్భుతమైన రుచితో గోలీసోడాను విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

గోలీ సోడా ప్రస్థానమిలా..

బ్రిటీష్ వలస పాలకులు రాజ్యమేలుతున్న రోజుల్లో హిరమ్ కాడ్ అనే విదేశీయుడు భారతదేశంలో గోలీసోడా ప్రవేశపెట్టాడు. అనతికాలంలోనే ఈ సంప్రదాయ పానీయం గురించి దేశమంతటా పాకిపోయింది. ఆ తర్వాత గోలీసోడా లేని రోజులను ఊహించుకోలేకపోయారు. బ్రాండెడ్ కూల్‌డ్రింక్స్ ఎన్నొచ్చినా గోలీసోడా అంటే ఇష్టపడే వారు దాన్ని ఎక్కడ అమ్ముతున్నా వెళ్లి తాగొచ్చేవారు.

స్టార్టప్‌తో ఆకట్టుకుని..

శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం కొత్తూరుకు చెందిన పల్లి రమణారెడ్డి, అనూరాధ దంపతుల కుమారుడు ఉదయ్‌కిరణ్‌రెడ్డి.. ఆయన తన సోదరుడు జయదీప్‌రెడ్డితో కలిసి స్టార్టప్ కంపెనీగా 'నెవర్ ఎండ్' పేరుతో గోలీసోడా ఉత్పత్తులను ప్రారంభించారు. 'కూల్ డ్రింక్‌లు ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు మళ్లీ పాత సోడా అంటే ఏం క్లిక్ అవుతుంది' అని పెదవి విరిచిన వాళ్లే గోలీసోడా రుచికి ఫిదా అయిపోయారు. అనంతపురం నుంచి దేశ నలుమూలలే కాదు మలేషియా, అమెరికా (టెక్సాస్, డల్లాస్), దుబాయ్ వంటి విదేశాలకు సైతం ఎగుమతి చేసే స్థాయికి ఎదిగారు. మొత్తం 150 ఫ్యాక్టరీలు.. 99 రకాల ఫ్లేవర్లు.. నిత్యం లక్షలాది మంది గోలీసోడా తాగే కస్టమర్లు.. ఇదేమీ చిన్న విషయం కాదు. ఈ ప్రస్థానం వెనుక అంతులేని శ్రమ ఉంది.

సక్సెస్ స్టోరీ

రసాయనాలు లేకుండా..

మాది సాధారణ కుటుంబం. చిన్నప్పుడు ఎన్నో కష్టాలు అనుభవించాం. ఉన్నత చదువులు అభ్యసించిన తర్వాత స్టార్టప్ కంపెనీ పెట్టాలని భావించి.. సమగ్ర అధ్యయనం చేశాం. ఇందులో గోలీసోడా కాన్సెప్ట్ బాగా నచ్చింది. అనుకున్నదే తడవుగా పరిశ్రమను ఏర్పాటు చేసి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ నేడు అంతర్జాతీయ స్థాయికి చేరాం. విదేశాల్లోనూ మా ఫ్రాంఛైజీ తీసుకుంటున్నారు. మేము ఒక్కో బాటిల్‌ను 14 సార్లు శుభ్రపరిచి రీఫిల్ చేస్తాం. సోడా తయారీలో ఎలాంటి రసాయనాలు వాడకుండా సహజసిద్ధమైన పండ్ల రసాల రుచులనందిస్తున్నాం.

– ఉదయ్‌కిరణ్‌రెడ్డి, 'నెవర్ ఎండ్' గోలీసోడా యజమాని

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిమర్రి: మండల కేంద్రం తాడిమర్రిలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శనివారం డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించారు. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర నలుమూలల నుంచి ఎనిమిది జతల వృషభాలు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో అనంతపురం జిల్లా యాడికి మండలం యంగన్నగారిపల్లి వాసుదేవరెడ్డి వృషభాలు నిర్ణీత 20 నిమిషాల్లో 1,550 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. సోమలదొడ్డి గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి వృషభాలు 1,500 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా బనగానపల్లి మండలం రామతీర్థం గ్రామానికి చెందిన నాగరాజు యాదవ్ వృషభాలు 1,250 అడుగులు లాగి తృతీయ స్థానంలో నిలిచాయి. అనంతరం విజేత వృషభాల యజమానులకు ప్రథమ బహుమతి కింద రూ.70వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.50 వేలు, తృతీయ బహుమతి కింద రూ.30 వేలుతో పాటు నాలుగో బహుమతి కింద రూ.20వేలు, ఐదో బహుమతి కింద రూ.10 వేలు చొప్పున అందజేశారు. ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామరావు, ఎస్ఐ క్రిష్ణవేణి తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు తాడిమర్రి మనోజ్‌రెడ్డి, చెన్నారెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, వైటీ చంద్రశేఖర్‌రెడ్డి, సాయినాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె అనుచరులతో ప్రాణహాని

- పోలీసులకు ఫిర్యాదు చేసిన పాత్రికేయుడు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఉద్దండం చంద్రశేఖర్, ఇతర జర్నలిస్టులు

పుట్టపర్తి టౌన్: మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అనుచరుల నుంచి తనకు ప్రాణహాని ఉందని ఓ దినపత్రిక పాత్రికేయుడు ఉద్దండం చంద్రశేఖర్ పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. పల్లెకు వ్యతిరేకంగా వార్తలు రాస్తావా అంటూ ఆయన అనుచరుడు, టీడీపీ నల్లమాడ మండల నాయకుడు సలామ్ తనపై దాడులు చేస్తామని, ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరిస్తూ పంపిన వీడియోను పరిశీలించి, తనకు రక్షణ కల్పించాలని కోరారు. నియోజకవర్గంలో మాజీ మంత్రి ఆగడాల గురించి పత్రికలో ప్రచురిస్తున్నందుకు తనను టార్గెట్ చేశారని పేర్కొన్నారు. వార్తలు రాయడం ఆపకపోతే నియోజకవర్గంలో తిరగకుండా చేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పీఆర్‌ఓ సంతోష్‌రెడ్డి నుంచి కూడా వాట్సాప్ గ్రూప్ ద్వారా బెదిరింపు మెసేజీలు వచ్చాయని పేర్కొన్నారు. ఉద్దండం వెంట వచ్చిన వారిలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి బాబు, సాక్షి స్టాఫర్ రాజేష్, జర్నలిస్టులు మురళి, రమణ, సోముశేఖర్ తదితరులు ఉన్నారు.

కారు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- కుక్కను తప్పించే క్రమంలో ఘటన



లక్ష్మీనరసింహ (ఫైల్)

పరిగి: కారు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మడకశిర మండలం మణూరు గ్రామానికి చెందిన లక్ష్మీనరసింహ(28) కారు బాడుగకు నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. గత శుక్రవారం బెంగళూరుకు బాడుగ వెళ్లాడు. అక్కడి నుంచి విజయ్‌కుమార్, బాలచంద్ర అనే ఇద్దరు మిత్రులతో కలిసి మడకశిరకు తిరుగుపయనమయ్యాడు. శనివారం వేకువజామున మూడు గంటలు దాటాక పరిగి వద్దకు చేరుకున్నారు. మడకశిర వైపు వెళ్తుండగా ఉన్నపళంగా కుక్క అడ్డుగా రావడంతో దాన్ని తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న నాగులకట్టను ఢీకొట్టి ఆ పక్కనే ఉన్న రేకుల షెడ్డులోకి దూసుకెళ్లింది. లక్ష్మీనరసింహతో పాటు ఇద్దరు మిత్రులు గాయపడ్డారు. వీరిని స్థానికులు 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే లక్ష్మీనారాయణ మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నారు. కారులో ప్రయాణిస్తున్న విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. కాగా లక్ష్మీనరసింహకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సస్పెండైన ఆర్ఐపై కేసు

కదిరి అర్బన్: సోషల్ మీడియాలో మాటలు వక్రీకరించి పోస్టులు పెట్టి పోలీసులకు, ఇతరులకు మధ్య శాంతియుత వాతావరణం దెబ్బతినేలా చేస్తున్నాడని కానిస్టేబుల్ గోవర్దన్ ఫిర్యాదు మేరకు ఓడీసీలో సస్పెండైన ఆర్ఐ మున్వర్‌బాషాపై కదిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ మేరకు సీఐ నారాయణరెడ్డి శనివారం మీడియాకు వివరాలు వెల్లడించారు. క్రిమినల్ కేసుల్లో నిందితునిగా ఉన్న మున్వర్‌బాషా హైకోర్టు బెయిల్ ఉత్తర్వులతో మార్చి 24న పట్టణ పోలీస్‌స్టేషన్‌కు హాజరయ్యారు. ఆ సమయంలో తనపై కేసులు పెట్టినవారంతా దొంగలే అంటూ కానిస్టేబుల్ గోవర్దన్, సీఐ నారాయణరెడ్డిని ఉద్దేశించి మీరు ఇక్కడ ఉద్యోగం ఎలా చేస్తారో చూస్తాను అని బెదిరింపులకు పాల్పడ్డారు. అనంతరం సోషల్ మీడియాలో వక్రీకరించిన మాటలతో పోస్ట్ పెట్టి పోలీసులు, ఇతరుల మధ్య శాంతియుత వాతావరణం దెబ్బతినేలా చేశారని పేర్కొన్నారు. వక్రీకరించిన వాయిస్‌ను వైరల్ చేస్తున్న వారందరికీ చట్ట ప్రకారం నోటీసులిచ్చి విచారణ చేస్తామని సీఐ తెలిపారు.

వృద్ధునిపై పోక్సో కేసు

ముదిగుబ్బ: మండల కేంద్రం ముదిగుబ్బలో ఓ వృద్ధునిపై పోక్సో కేసు నమోదైంది. శనివారం ఇంటి సమీపంలో ఆడుకుంటున్న ఆరేళ్ల బాలికను వృద్ధుడు దగ్గరకు తీసుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. అనంతరం విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వృద్ధునిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వృద్ధునిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ శివరాముడు తెలిపారు.

పేదలకు సేవ చేస్తే దేవునిగా కీర్తిస్తారు



ఫాదర్ ఫెర్రర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విశా ఫెర్రర్

బత్తలపల్లి: పేదల కోసం ఎవరైతే పాటుపడతారో వారిని గుండెల్లో పెట్టుకుని దేవునిలా కీర్తిస్తారని ఆర్డీటీ మహిళా సాధికారిత డైరెక్టర్ విశా ఫెర్రర్ అన్నారు. శనివారం మాల్యవంతం ఎస్సీ కాలనీ వాసులు ఏర్పాటు చేసిన ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ కాంస్య విగ్రహాన్ని విశా ఫెర్రర్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరువు పీడిత ఉమ్మడి అనంతపురం జిల్లాలోకి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అడుగుపెట్టినపుడు వెనక్కు వెళ్లిపోవాలని కొందరు అడ్డుపడ్డారన్నారు. పేదల సంక్షేమం కోసం ఆయన చేపట్టిన కార్యక్రమాలు, వివిధ రంగాల్లో ప్రోత్సహించిన తీరును చూసి దేవుడని కొనియాడుతున్నారని గుర్తు చేశారు. మనం ఒకరికి సాయం చేయాలన్న ఆశయంతో ముందుకు వెళ్లారని, ఆయన బాటలోనే పలువురు ఈరోజు ముందుకు వస్తున్నారని తెలిపారు. మాల్యవంతంలో పలువురు ఆర్డీటీ సహకారంతో అభివృద్ధి సాధించారని వివరించారు. అలాంటి వారందరూ కలిసిమెలిసి ఉండి ఆర్డీటీ, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను పొందుతూ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అంతకు ముందు విశా ఫెర్రర్‌కు ఎస్సీ కాలనీ వాసులు ఘనస్వాగతం పలికారు. ఆర్డీటీ సహకారంతో ఉన్నత చదువులు చదివి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న తమ పిల్లల తరఫున తల్లిదండ్రులు ఓబుళమ్మ, కుళ్లాయప్ప 'స్పందించు- సాయం అందించు' కార్యక్రమానికి రూ.50 వేలను విశా ఫెర్రర్‌కు అందించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రీజనల్ డైరెక్టర్ ప్రమీల, ఏటీఎల్ క్రిష్ణ, ఎస్టీఎల్ వెంకటేష్, కావేరి, మధు, సీఓ నాగరాజు, సీబీటీ వీరనారప్ప, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం.. అప్రమత్తతే ప్రధానం

- రేపటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు
- అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన
- మాక్‌డ్రిల్స్‌కు అగ్నిమాపక శాఖ సర్వం సిద్ధం



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది (ఫైల్)

పుట్టపర్తి టౌన్: వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువ జరుగుతుంటాయి. చిన్న నిప్పు రవ్వ పడినా మంటలు వ్యాపిస్తాయి. ఆకతాయి చేష్టలకు, ఏమరపాటుకు గడ్డి వాములు, అడవులు దగ్ధమతున్నాయి. ఈ నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు తగ్గించి ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు అగ్నిమాపక శాఖ మాక్‌డ్రిల్స్ నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేస్తోంది. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించనున్నారు. 14న అమరవీరులకు నివాళి, 15వ బహిరంగ ప్రదేశాలు, కూడళ్ల అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు కల్పిస్తారు. 16న అపార్టుమెంట్లు, 17న విద్యాసంస్థలు, 18న గ్యాస్ గోడౌన్లు, ఆయిల్ ఫాంలు, 19న ఆస్పత్రుల్లో అవగాహన కల్పిస్తారు. 20న అన్ని వర్గాల ప్రజలకు ఫైర్ సేఫ్టీపై వర్క్‌షాప్ నిర్వహించి వారోత్సవాలు ముగిస్తారు.

అందుబాటులో ఫైర్ సేవలు..

జిల్లాలో పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, పెనుకొండ, హిందూపురం, మడకశిర అగ్నిమాపక కార్యాలయాలు ఉన్నాయి. ఆరుగురు ఫైర్ అధికారులతో పాటు జిల్లాలో 100 మంది సిబ్బంది, 24 మంది హోంగార్డులు ఉన్నారు. ప్రమాదాల నివారణకు అవసరమైన అడ్వాన్స్‌డ్ వాటర్ టెండరింగ్ ఫైర్ ఇంజిన్, రెస్క్యూ ఫైర్ ఇంజిన్, ట్రూప్ క్యారియర్, ఫైర్ బుల్లెట్ బైక్, మిస్ట్ జీపులు అందుబాటులో ఉన్నాయి. కాలం చెల్లిన ఇంజిన్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. జిల్లాలో ఒక అగ్నిమాపక అధికారి, ఇద్దరు సహాయక అధికారులు జిల్లా వ్యాప్తంగా వాహనాలను అగ్నిమాపక అధికారి కాని, సహాయక అధికారి గాని తనిఖీ చేస్తుంటారు. అప్రమత్తంగా ఉండాలని ప్రమాదాలు ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచనలు సలహాలు ఇస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి..

చిన్న పిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాసులు వంటివి ఇవ్వకూడదు. దుస్తులకు నిప్పు అంటుకుంటే పరిగెత్తకుండా దుప్పటి చుట్టుకోవాలి. వంట గదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్ వంటివి ఉంచకూడదు. మండుతున్న పొయ్యిపై వస్తువులను దూరం నుంచి అందుకోవాలని ప్రయత్నించకూడదు. మండుతున్న స్టవ్‌పై కిరోసిన్ పోయడం ప్రమాదకరం. చెడిపోయిన గ్యాస్ ట్యూబ్ స్థానంలో ఐఎస్ఐ మార్కుగల కొత్త ట్యూబ్ అమర్చాలి.

జిల్లాలో ఫైర్ స్టేషన్ల నంబర్లు

అగ్నిమాపక కేంద్రం	ల్యాండ్ నంబర్	మొబైల్ నంబర్
ధర్మవరం	08559-220626	99637 40213
హిందూపురం	08556-220888	99637 39702
కదిరి	08494-224266	73373 95556
మడకశిర	08493-288101	99637 40643
పెనుకొండ	08555- 220299	99667 40127
పుట్టపర్తి	08555-287299	99637 40363

ప్రణాళికతోనే ప్రమాదాల నివారణ



ఎండలు మండుతున్న నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జాగ్రత్తలు కూడా తప్పకుండా పాటించాలి. ప్రణాళికతో అగ్నిప్రమాదాలు నివారించవచ్చు. సిబ్బందితో పాటు అవసరమైన పరికరాలు, యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. అగ్నిమాపక వారోత్సవాల ద్వారా ప్రజలను అప్రమత్తం చేసేలా అవగాహన కార్యక్రమాలు చేపడతాం. – హేమంత్‌రెడ్డి, డీఎఫ్ఓ

సాక్షి సండే క్లాసిఫైడ్స్

EDUCATION

అడ్మిషన్స్

■ ఇంటర్ పాస్ స్టూడెంట్స్ కి B.Sc. (నర్సింగ్). B.Sc (MLT), GNM (నర్సింగ్), DMLT (బ్లడ్ టెస్ట్ కోర్స్), గవర్నమెంట్ సీట్స్ కి అడ్మిషన్స్ జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్. సంప్ర: G.మురళి, 9030661651, అనంతపురం. [A-1558]

అడ్మిషన్స్

■ NEET లో సీటు రాదని చింతిస్తున్నారా? LONG TERM చేసి మళ్లీ సమయం వృథా చేయదలుచుకోలేదా? ప్రైవేట్ కాలేజీలో 1 కోటి రూపాయలు పెట్టి చదివే స్తోమత లేదని బాధపడుతున్నారా? ఆందోళన వద్దు - Docrus Consultancy మీ కోసం ఉంది! ₹18 లక్షల్లో రష్యాలో MBBS పూర్తి చేయండి, మీ డాక్టర్ కలను నిజం చేసుకోండి. NMC గుర్తింపు, నాణ్యమైన మెడికల్ విద్య, తక్కువ ఖర్చు, వీసా, అడ్మిషన్ వరకు పూర్తి సహాయం. ఉచిత కౌన్సిలింగ్ కోసం ఇప్పుడే సంప్ర. 6302827687 (వాట్సప్), 9110305054 . [A-1564]

REAL ESTATE

TO-LET

■ డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు, మంచినీరు పుష్కలం, బాడుగ Rs. 8000/- మాత్రమే. అనంతపురం టౌన్ నందు కళ్యాణదుర్గం రోడ్డుకు, Dr. రజాక్ హాస్పిటల్ వద్ద. Ph: 9951626131. [A-1571]

TO-LET

■ 2BHK Houses - 2, బాడుగకు కలవు. సంప్రదించండి : D.No: 10/370, కళింగ షాపింగ్ మాల్ ఎదురుగా, సరోజిని రోడ్, అనంతపురం. 9441377933. [SCA25002739]

APARTMENT FOR SALE

■ G+3, Present Balaji Ladies Hostel, RTO Office Road, ATP. D.No. 28/4/997/7 Hamali Colony, Revenue Ward 28. 2021 Construction : Each Apartment sharing rooms with 6 Bathroom & Latrins. Measurement : 60x40, West Facing. Contact No's: 9440777866, 7981959592. [A-1562]

PLOT FOR SALE

■ 10 సెంట్స్ వెస్ట్ పేస్ (66X66) నియర్ యూనియన్ బ్యాంక్ నియర్ హైవే 2 nd బిట్ జవహర్ భారతి హైస్కూల్ తపోవనం, ATP. సెల్ : 9347067464. [SCA25002746]

PLOT FOR SALE

■ ATP, సాక్షి ఆఫీస్ బ్యాక్ సైడ్, నియర్ పెట్రోల్ బంక్, రోడ్ ఫేసింగ్‌కు 200 అడుగులు వెడల్పుగల, 21 సెంట్లు కమర్షియల్ స్థలము అమ్మబడును. కాంటాక్ట్ డైరెక్ట్ ఓనర్: 6300772262. [A-1538]

LAND FOR SALE

■ ATP, రాప్తాడు దగ్గర, N.H. 44 హైవే రోడ్ ఫేసింగ్, 2.26 ఎకరాలు & ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ ఎదురుగా 12 సెంట్లు అమ్మబడును. కాంటాక్ట్ డైరెక్ట్ ఓనర్: 9553911999. [A-1539]

LEASE / RENT

■ COMMERCIAL SPACE 1750 Sft. AVAILABLE FOR LEASE / RENT @ S.J. Towers, Vidyuth Nagar Circle, Opp: Lakshmi Hospital, (Ground Floor IOB Bank & 1st Floor, Gooty Town Bank) 2nd Floor Vacant. Anantapur. Contact : 8886026786. [SCA25002741]

FOR RENT

■ ATP, ఓబులదేవనగర్, (విద్యుత్ నగర్ సర్కిల్ & అపోలో ఫార్మసీ సమీపంలో), 80 ఫీట్ రోడ్ పక్కనే, 1400 చ.అ. విస్తీర్ణం గల కమర్షియల్ బిల్డింగ్ బాడుగకు కలదు. బ్యాంకులు, క్లినిక్స్, ల్యాబ్, రిటైల్, ఆఫీస్‌లు, షోరూమ్‌లకు అనువైనది. సంప్ర: 9642138599. [A-1559]

SERVICES

BUSINESS OFFER

■ Big Business Opportunity. India's No.1 home automation smart switches manufacturing company is appointing District wise Distributors., franchise partners, all across Rayalaseema Region. 7993775414 9550301632 www.dveautomation.in [HA-325]

WANTED

■ కిసాన్ మిత్రలో NLM స్కీమ్ క్రింద రిలేషన్‌షిప్ మేనేజర్స్, DMలు కావలెను. జీతం: మేనేజర్స్‌కి 25 వేలు, DM లకి 35 వేలు. అర్హత: 10th to డిగ్రీ వరకు. సంప్ర।। 9392282701, 9000501816, 8341890291. [A-1568]

■ అనుభవం కలిగిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. # J.K. ఎంటర్‌ప్రైజెస్, మాంటిస్సోరి స్కూల్ ఎదురుగా, గుత్తి రోడ్, అనంతపురం. సెల్: 80088 03109. [A-1567]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ BELL INFRA ప్రాజెక్ట్ కొరకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. టార్గెట్స్‌తో సంబంధం లేకుండా ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్ కలవు. 9989452444. [A-1569]

■ విజయవాడలో A/C Rental Events కంపెనీకి డ్రైవింగ్ తెలిసిన హెల్పర్స్, A/C టెక్నీషియన్స్ కావలెను. జీ: 20-25000/- భో+వసతి+ఫ్రీ ట్రైనింగ్. ✆ 99660 44671 [B-1270235]

■ కావలెను. కేర్ టేకర్స్ నర్సులు, విజయవాడలో పేషెంట్ల ఇళ్ళ వద్దనే వుండి చూసుకొనుటకు అత్యధిక జీతం+ వ+భో. ఆంధ్ర హోమ్‌కేర్స్ VJA ✆ 91608 35559, 93473 80332 [B-001]

■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA 25002700]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ KGR డెవలపర్స్ నందు మార్కెటింగ్ HEAD (జీతం 30K-50K+ Incentives) మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టెలికాలర్స్ కావలెను. జీతం(10K-15K+ Incentives) కర్నూలు. సెల్: 63040 30020 [L-002]

■ Required Collection Experienced Field Team Leaders & Collection Executives for Ananthapur, Kalyandurgam, Gooty, Guntakal, Tadipatri, Dharmavaram, Fixed Salary + Incentive + Travelling Allowance ✆ 81218 04781. [B-014]

■ హోటల్‌లో పనిచేయుటకు అనుభవం గల ఇడ్లీ మాస్టర్ కావలెను. జీతం: 20-24 వేలు, రూము, వసతి కలదు. సెల్: 9441143515, 9885149928. [A-1570]

■ WANTED SOLAR HELPERS. Q: ITI (ELECTRICIAN) SALARY: ₹ 9,000 # ANANTAPUR. 9160353879. [A-1573]

■ మార్కెటింగ్ బిజినెస్ చేయుటకు అనుభవం కలిగిన సేల్స్ మెన్ కావలెను. # ENR గ్రూప్ ఆఫ్ కంపెనీస్, 9441179555. [SCA25002736]

■ హరేకృష్ణ హోంకేర్ విజయవాడలో వృద్ధులను, పేషెంట్లను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీతం: 18k Ph: 9640648899, 9640528899 [HA-1907]

■ నిరుద్యోగులకు శుభవార్త, అనంతపురం జిల్లాలోని అన్ని మండల, గ్రామపంచాయతీలలో ఇంటినంబర్లు వేయడానికి మండలాల వారీగా ఏజెంట్లు కావలెను. 8886868095. [SCA25002745]

■ డ్రైవర్స్ కావలెను. డ్రైవింగ్ లైసెన్స్, EXP: 3 సం।।, విద్యార్హత: 10th పాస్/ఫెయిల్. వయస్సు: 20-35 సం।।, జీతం: ₹ 15,500 + PF +ESIC, TA, O.T, భోజన సదుపాయం కలవు. # హుండాయ్ గ్లోవిస్-VPC, కియా, పెనుకొండ. 9066192421, 9390490947 [A-1572]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.